ఆగిన బస్సులు.. ప్రయాణికుల అవస్థలు

- ఆళ్లగడ్డలో హైర్ బస్సు డ్రైవర్‌పై దాడి
- డ్రైవర్ల ఆందోళనతో నిలిచిపోయిన బస్సులు
- స్తంభించిన రాకపోకలు
- ప్రయాణికులకు తప్పని రవాణా కష్టాలు


కోవెలకుంట్ల డిపోలోనే నిలిచిపోయిన హైర్ బస్సులు


బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు

కోవెలకుంట్ల: వైఎస్సార్ జిల్లా దువ్వూరు సమీపంలో బస్సు ఆపలేదన్న కారణంతో ఆళ్లగడ్డ డిపోకు చెందిన హైర్ బస్ డ్రైవర్‌పై దాడికి నిరసనగా హైర్ బస్ డ్రైవర్లు బుధవారం ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లాలోని కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ, నంద్యాల, డోన్, ఆత్మకూరు, నందికొట్కూరు డిపోల్లోని హైర్ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. కోవెలకుంట్ల డిపోలో మొత్తం 49 బస్సులు ఉండగా, అందులో 17 హైర్ బస్సులు నంద్యాల, ఆళ్లగడ్డ, తాడిపత్రి, జమ్మలమడుగు, కర్నూలు ప్రాంతాలకు నడుస్తున్నాయి. దాడినిక ఖండిస్తూ డ్రైవర్లు విధులకు హాజరుకాకపోవడంతో ఉదయం నుంచే బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. కోవెలకుంట్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, విద్యార్థులు, ప్రజలు ప్రతి రోజు ఆయా రూట్లలో రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం నుంచి బస్సులు నిలిచిపోవడంతో ఆయా రూట్లలో రాకపోకలు స్తంభించిపోయాయి. బస్సులు లేక ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు సమయం దాటిపోవడంతో గమ్యస్థానాలు చేరేందుకు అష్టకష్టాలు పడ్డారు. ఆటోలు, కార్లు, ఇతర ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి కొందరు రాకపోకలు సాగించగా మరికొందరు బస్సులు తిరగకపోవడంతో ఇళ్లకు వెళ్లిపోయారు. బస్సులు తిరగక మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

డ్రైవర్‌పై దాడిచేసిన వ్యక్తులను శిక్షించాలి

ఆళ్లగడ్డ డిపోలో పనిచేస్తున్న హైర్ బస్ డ్రైవర్‌పై దాడిచేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సుధాకర్, హైర్ బస్ డ్రైవర్ల అసోసియేషన్ డిపో సెక్రటరీ వెంకటేష్ డిమాండ్ చేశారు. డ్రైవర్‌పై దాడిని ఖండిస్తూ బుధవారం కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువకులు మంచి చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు రాక ప్రైవేట్ బస్సు డ్రైవర్లుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఆర్టీసీ నిబంధనల ప్రకారం బస్సుల్లో ప్రయాణికులను ఎక్కించుకోవడం జరుగుతుందన్నారు. పరిమితికి మించి ఎక్కుతున్న క్రమంలో డ్రైవర్లు అదుపు చేస్తుంటే దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీని వల్ల ప్రయాణికులకు ఏ చిన్న ప్రమాదం జరిగినా డ్రైవర్లను కారకులను చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం హైర్ బస్సు డ్రైవర్లక రక్షణ కల్పించాలని కోరారు.

ప్రయాణికుల ఇక్కట్లు

బనగానపల్లె రూరల్: ఉచిత బస్సు పథకంతో మహిళా ప్రయాణికులతో పాటు విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు కూడా భారీగా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. అయితే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఆర్టీసీ సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజుల క్రితం ఆళ్లగడ్డ డిపోకు చెందిన హైర్ బస్సు డ్రైవర్‌పై ప్రయాణికులు దాడి చేశారు. దీనికి నిరసనగా బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ డిపోల హైర్ బస్సు డ్రైవర్లు బుధవారం నిరసన చేపట్టి బస్సులను నిలిపివేశారు. కేవలం అరకొర రెగ్యులర్ సర్వీసులు మాత్రమే నడిచాయి. తగినంత బస్సులు లేని కారణంగా పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులతో ఉన్న తల్లులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


బనగానపల్లె బస్టాండ్‌లో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఆర్టీసీ బస్సు డ్రైవర్ల నిరసన

డోన్ టౌన్: దువ్వూరు వద్ద ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ పట్టణ, మండల కార్యదర్శులు శివరామ్, శ్రీకాంత్, ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు సుబ్బయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక డిపో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సమ్మెతో ఆర్టీసీ అద్దె బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్సులో కిక్కిరిసి ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ఆపలేదని దాడి చేయడం సరికాదన్నారు. ఇలాంటి ఘటనలు పునావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైవర్లు, యూనియన్ నాయకులు లక్ష్మన్న, మద్దయ్య, మారుతి, బాషా, రమణ, కర్ణ, సుబ్బరాయుడు పాల్గొన్నారు.


డోన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న డ్రైవర్లు

ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు కిరణ్, బుజ్జి, మురళీ, కత్తి ఓబులేసు, హైర్ బస్ డ్రైవర్లు సురేంద్ర, మహేష్, రాజు, కేశవరెడ్డి, అంబయ్య, సుబ్బరాయుడు, కేశవ, చెన్నయ్య, మధు, బాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం

సంజామల: మండల పరిధిలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సెపక్ తక్రా పోటీల్లో రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారు. ఈ నెల 5వ తేదీ ఆళ్లగడ్డలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు హుస్సేన్ బాషా, చాంద్ బాషా, బాలికల విభాగంలో షాహిర, బషరున్, సమిరాభి ప్రతిభ చాటారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారని హెచ్‌ఎం మురళీకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం వ్యాయామ ఉపాధ్యాయుడు మౌలాలి, విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

వేంకటేశ్వరునికి వెండి కవచం కానుక


స్వామి వారికి పూజలు చేస్తున్న దాతలు

బేతంచెర్ల: స్థానిక దుర్గాపేట కాలనీలోని వేంకటేశ్వరస్వామికి రిటైర్డ్ ఎస్‌ఐ మద్దయ్య, రాములమ్మ జ్ఞాపకార్థం కుమార్తె ఉషా కుమారి, కుమారులు గోపినాథ్, ప్రవీణ్ కుమార్ ఒకటిన్నర కేజీ వెండి కవచాన్ని కానుకగా సమర్పించారు. బుధవారం ఉదయం ఆలయంలో హోమం, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడికి వెండి కవచం అందజేశారు.

రెడ్డి సంక్షేమ భవనానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న రెడ్డి సంఘం నేతలు

బేతంచెర్ల: పేదలు, అట్టడుగు వర్గాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి రామ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి గౌరవాధ్యక్షుడు హుసేన్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమాజ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగేశ్వర్‌రెడ్డి, బుగ్గన ప్రసన్నలక్ష్మి, ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, చంద్రమౌళీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంజేపీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు

బేతంచెర్ల: మండల పరిధిలోని గోరుమానుకొండ సమీపంలోని మహాత్మ జ్యోతిబాపూలే (ఎంజేపీ) స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దేవేంద్రకుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు సంజీవ్, నాగేషు తెలిపారు. కల్లూరు మండలం చిన్నటేకూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో కబడ్డీ విభాగంలో వీరేంద్ర, వాలీబాల్‌లో అమర్, ఖోఖోలో వసంత్, చరణ్, మాధవ గణేష్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని చెప్పారు. విద్యార్థులను అభినందించి భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు



బేతంచెర్ల: స్థానిక నంద్యాల రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆశ్వయుజమాసం బుధవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో వినాయక, సుబ్రమణ్యేశ్వరస్వామి, అయ్యప్పస్వామికి పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

10 నుంచి స్కూల్ గేమ్స్

కొలిమిగుండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల కో–ఆర్డినేటర్ నాగరాణి బుధవారం తెలిపారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంఈఓలు అబ్దుల్‌కలాం, రామకృష్ణయ్య పర్యవేక్షణలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామన్నారు. అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మత్తుతో చిత్తు కావొద్దు

డోన్ టౌన్: గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వినియోగం జీవితాలను నాశనం చేస్తుందని పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా హెచ్చరించారు. ఈగల్ టీం ఆధ్వర్యంలో శ్రీవైష్ణవి డిగ్రీ కళాశాలలో బుధవారం "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమం నిర్వహించారు. మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం గమనించిన వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. కార్యక్రమంలో ఈగల్ టీం సభ్యులు ప్రసాద్, మనోహర్, శక్తి టీం సభ్యురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్యాపిలి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వైస్ ఎంపీపీ రాజా రూపారాణి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ భారతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు సమర్పించారు. అనంతరం వైస్ ఎంపీపీ, ఎంపీడీఓ, తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని.. ఈ విషయంలో సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రభాకర్, వ్యవసాయాధికారి రాజేశ్, ఉద్యాన అధికారిణి కళ్యాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోహర్, ఎంఈఓ వెంకటేశ్ నాయక్, కో ఆప్షన్ సభ్యులు జలదుర్గం రసూల్, ఎంపీటీసీలు సరస్వతి, రామానాయుడు, రంగన్న, శ్రీరాములు, మదనశేఖర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

పెద్దమ్మ సేవలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి

బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో వెలసిన పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని హైకోర్టు మాజీ న్యాయమూర్తి శేషశయనారెడ్డి, ఆయన సతీమణి జస్టిస్ ప్రవీణ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు న్యాయమూర్తి దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత ఆలయంలోని నిత్యాన్నదాన సంస్థను సందర్శించారు. నిర్వహణ విధానాలను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు అందించారు. నిత్యాన్నదాన సంస్థ నిర్వహకులు రామగంగిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నిత్యాన్నదాన సంస్థ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ జడ్జి శేషశయనారెడ్డి

ఆత్మహత్యకు యత్నించిన వివాహిత మృతి

కొలిమిగుండ్ల: ఆత్మహత్యకు యత్నించిన వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బెలుంకు చెందిన స్వాతి(27)కి తుమ్మలపెంటకు చెందిన పల్లె ఏసుదాసుతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొద్ది రోజుల నుంచి భర్త, అత్త నుంచి వేధింపులు అధికమయ్యాయి. మృతురాలి తల్లితండ్రులు జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నారు. పుట్టింటికి పోవాలని నిర్ణయించుకుని చివరకు విరమించుకుని ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. రెండు రోజుల క్రితం రంగుల్లో కలిపే టిన్నర్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. కాలిపోయిన ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.


స్వాతి(ఫైల్)

మహిళ ఆత్మహత్య

సంజామల: మండల పరిధిలోని కానాల గ్రామానికి చెందిన ఓ మహిళ బుధవారం ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల సమాచారం మేరకు.. కానాల గ్రామానికి చెందిన మహమ్మద్ ఉస్సేన్ కుమార్తె హసీన అలియాస్ ఉస్సేన్‌బీ(30) బుధవారం మధ్యాహ్నం విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను కోవెలకుంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కోలుకోలేక మహిళ మృతి చెందింది. మృతురాలు టీటీసీ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటోంది. మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు.

రామేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు

పలుకూరు గ్రామంలో వెలసిన రామేశ్వర స్వామి ఆలయంలో మూలవిరాట్‌పై బుధవారం ఉదయం సూర్యకిరణాలు స్పృశించాయి. ఉదయం 6.45 నుంచి 7.10 గంటల వరకు ఈ దృశ్యం కనిపించింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భాస్కరయ్య మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఉత్తరాయణం, దక్షిణాయనం సందర్భాల్లో రెండు సార్లు ఈ సూర్యకిరణాల దర్శనం జరుగుతుందని తెలిపారు. ఈ అపురూప దృశ్యం చూసి భక్తులు పరవశించిపోయారు.

– బనగానపల్లె రూరల్



చట్టాలపై అవగాహన అవసరం

కొలిమిగుండ్ల: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మహిళా పోలీస్ సీఐ గౌతమి అన్నారు. బుధవారం కొలిమిగుండ్లలోని షిర్డీ సాయి ఫంక్షన్ హాల్‌లో మహిళలు, విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. శక్తియాప్, పోక్సో చట్టం గురించి వివరించారు. సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహాలు చేయడం వల్ల అనర్థాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఆడపిల్లలు ఉన్నత చదువులు చదివి సమాజంలో ఉన్నత స్థానాల్లో నిలబడాలని ఆకాంక్షించారు. మహిళలను వేధింపులకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎస్‌ఐ గోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య

అవుకు(కొలిమిగుండ్ల): సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి హేయమైన చర్య అని జైభీమ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అవుల దేవరత్నం అన్నారు. బుధవారం అవుకులో ఆయన మాట్లాడుతూ.. సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. దాడి చేసిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు అవుల మనోహర్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

మోడీ పర్యటనను విజయవంతం చేద్దాం

డోన్ టౌన్: ఈ నెల 16న కర్నూలు జిల్లా పర్యటనకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనను అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దు బండి కిరణ్, జిల్లా ఉపాధ్యక్షురాలు చాందినీ పిలుపునిచ్చారు. స్థానిక మాకంవీధిలోని కార్యాలయంలో బనగానపల్లె నియోజకవర్గ నాయకులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ప్రచారం చేసి రైతులు, కూలీలు సహా అందరికీ మోడీని ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించాలని సూచించారు. పార్టీ నాయకులు బచ్చు శరత్ చంద్రకుమార్ పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

డోన్ టౌన్: సమాజంలో విలువలతో కూడిన విద్య అవసరం ఎంతైనా ఉందని ఎంపీ బైరెడ్డి శబరి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈ విద్యా సంవత్సరం నూతనంగా ప్రారంభించిన కేంద్రీయ విద్యాలయం తరగతులను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని.. డోన్‌కు కేంద్రీ విద్యాలయం మంజూరు కావడం హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ నరసింహులు, ప్రిన్సిపాల్ మాలిక్ పాల్గొన్నారు. కేంద్రీయ విద్యాలయంలో మరికొందరు విద్యార్థులకు అవకాశం కల్పించి అదనపు తరగతి గదులను ఏర్పాటు చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు బోంకేరి రవికుమార్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్

డోన్ టౌన్: ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు తెలిపారు. డోన్ డిప్యూటీ డీఈఓ వెంకటరామిరెడ్డి, మండల విద్యాధికారులు ప్రభాకర్, రఘునాయక్ ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పేలిన అంబులెన్స్ టైర్

బండి ఆత్మకూరు: ప్రాణాపాయస్థితిలో ఉన్న వృద్ధుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో 108 అంబులెన్స్ టైరు పేలి గంటల కొద్దీ రోడ్డు మీద నిరీక్షించాల్సిన పరిస్థితి మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. వెలుగోడు మండలం బోయరేవుల గ్రామానికి చెందిన బిల్లా బక్కన్న అనే వృద్ధుడు తీవ్ర అనారోగ్యంతో వెలుగోడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. ఈ క్రమంలో బండి ఆత్మకూరు సమీపంలోకి రాగానే వాహనం వెనక టైరు పేలడంతో అంబులెన్స్ ఆగిపోయింది. దీంతో వెంటిలేటర్‌పై ఉన్న వృద్ధుడి పరిస్థితి ఆందోళన కలిగించింది. సిబ్బంది ఆయనకు చికిత్స కొనసాగిస్తూ మరో వాహనం కోసం సమాచారం అందించారు. గంట సేపటికి మరో అంబులెన్స్ రావడంతో వృద్ధుడిని అందులోకి ఎక్కించి నంద్యాలకు తరలించారు.

పథకాల అమలులో ప్రభుత్వం విఫలం


పార్టీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో భేటీ అయ్యారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా తీశారు. కూటమి నాయకులు ఎన్నికల్లో గెలవడానికి ఎన్నో హామీలు ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాక చేతులెత్తేశారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులకు సూచించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, మండల కన్వీనర్ తిరుమలేశ్వరరెడ్డి, యంబాయి సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, యాకోబ్ పాల్గొన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

శుభకార్యం

డోన్: దక్షిణ కొరియా అబ్బాయి చాసుయింగ్ హాయేన్(ఆదిత్య), డోన్ అమ్మాయి జాహ్నవిలు మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, క్లస్టర్ యూనివర్సిటీ ఈసీ సభ్యుడు ముడియాల నాగభూషణంరెడ్డి, శైలజ దంపతుల ఏకైక కుమార్తె జాహ్నవి దక్షిణ కొరియాలో ఎంటెక్ పూర్తి చేసింది. ఆ సమయంలోనే చాసుయింగ్ హాయేన్‌తో స్నేహం ఏర్పడింది. ఇరువురి మనసులు కలవడంతో ప్రేమించుకున్నారు. పెళ్లికి ఇరు కుటుంబాలను ఒప్పించారు. ఈ నేపథ్యంలో వీరి వివాహం బుధవారం డోన్ పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జంటను మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, నంద్యాల, కర్నూలు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు మేయర్ బీవై రామయ్య, నంద్యాల, బనగానపల్లె, పత్తికొండ, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యేలు శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, కంగాటి శ్రీదేవి, శిల్పా రవికిశోర్‌రెడ్డి తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

మానసిక ప్రశాంతతతోనే సంపూర్ణ ఆరోగ్యం

డోన్ టౌన్: మానసిక ప్రశాంతతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జాల్లా కెరీర్ మరియు హెల్త్ కౌన్సిలర్స్ మౌలాలి, శ్రీరామ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ, మోడల్ స్కూల్‌లో మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, మైండ్ రిలాక్షన్ యాక్టివిటీలు నిర్వహించారు. ఒత్తిడి, ఆందోళన, వ్యాకులత, సాధారణ ప్రవర్తన వంటి అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులు మానసిక ఆరోగ్య ప్రాధాన్యతపై ర్యాలీ నిర్వహించి ప్రజల్లో చైతన్యం కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న హెల్త్ కౌన్సిలర్లు

జలదుర్గంలో ప్రభుత్వ స్థలాల పరిశీలన

ప్యాపిలి: మండల పరిధిలోని జలదుర్గం గ్రామంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, స్థలాలను ఆర్డీఓ నరసింహులు బుధవారం పరిశీలించారు. జలదుర్గంను మండలంగా ఏర్పాటు చేయాలని ఇటీవల వివిధ గ్రామాల సర్పంచ్‌లు తీర్మానాలు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ గ్రామాన్ని సందర్శించారు. పీహెచ్‌సీ, గ్రంథాలయం, ఇతర కార్యాలయాలను పరిశీలించారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. ఆర్డీఓతో పాటు తహసీల్దార్ భారతి, వీఆర్‌ఓ సునీల్ ఉన్నారు.


ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

తగ్గిన జీఎస్టీతో ప్రజలకు మేలు

బనగానపల్లె రూరల్: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు జీఎస్టీ, సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కామర్స్ విభాగం అధిపతి డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు నాగతిమ్మయ్య, వరలక్ష్మీ, మాధవి పాల్గొన్నారు.


బనగానపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు